
సాక్షి
ఒడిశా
మంగళవారం। 31। డిసెంబర్। 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,66,288లు, బంగారం 2గ్రాములు, వెండి 192 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జాప్యం తగదు

పంట నష్ట పరిహారంలో జాప్యం తగదని నవీన్ పట్నాయక్ అన్నారు. ఆయన పంట పొలాలను పరిశీలించారు. - 8లో.



గిరిజన బాలలకు చేయూత

ప్రవేశ పరీక్షలు రాస్తున్న గిరిజన బాలలకు చేయూత లభిస్తోంది. ఓ వ్యక్తి శిక్షణ ఇస్తున్నారు. - 8లో.

న్యూస్‌రీల్

14 యూనిట్ల రక్తం సేకరణ

జయపురం: సమాజ సేవి, రక్తదాత స్వర్గీయ కార్తీక రౌత్ పెద్ద కర్మ సందర్భంగా అతడి జ్ఞాపకార్థం సోమవారం అతడి బంధుమిత్రులు, అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏటా ఈ శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. స్థానిక రుతురాజ్ కల్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 14 యూనిట్ల రక్తం సేకరించినట్లు వెల్లడించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



బాధితురాలు సుశీల

రాయగడ : స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న పల్లిశ్రీ మేలా ఉత్సవాలను చూసి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు ఓ మహిళ మెడలో గొలుసు తెంపుకుని వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితురాలు ఆదివారం ఫిర్యాదు చేశారు. పట్టణంలో గల గౌతం నగర్ నాల్గో లైన్‌లో నివాసం ఉంటున్న ఎం.సుశీల (55) అనే మహిళ శనివారం సాయంత్రం పల్లిశ్రీ మేళాకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో స్థానిక రైల్వే అండర్ గ్రౌండ్ వద్దరు ఇద్దరు బైక్‌పై వచ్చి గొలుసు తెంచుకుని వెళ్లిపోయారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



పర్లాకిమిడి కాలేజ్ జంక్షన్ వద్ద వామపక్షాల నిరసన

పర్లాకిమిడి: రాజ్యసభలో కేంద్రమంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత భీమ్ రావ్ అంబేడ్కర్‌ను హేళన చేయడాన్ని ఖండిస్తూ వామపక్షాలు, సీపీఐఎంఎల్ (లిబరేషన్), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో పర్లాకిమిడి కాలేజ్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. అమిత్ షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వామపక్షాల నాయకులు డిమాండు చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి దండపాణి రయితో, సీపీఐ జిల్లా కార్యదర్శి జోన్న సుభాష్ చంద్రరావు, సీపీఎం లిబరేషన్ కార్యదర్శి శ్రీను బెహరా, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు పైల మురళీకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి లింగరాజ్ దోళాయి, ఎం.బంగారి, ఆదివాసీ మంచ్ నాయకులు గోకులధర్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

బూటకపు దంపతులు అరెస్టు



హన్సితా అభిలిప్సా



అనిల్ కుమార్ మహంతి

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా కూతురు, అల్లుడిగా నటిస్తూ ఎందరినో బురిడీ కొట్టించిన బూటకపు దంపతులు అరెస్టయ్యారు. స్థానికంగా ఉంటున్న అనిల్ కుమార్ మహంతి, హన్సితా అభిలిప్సా అనే ఇద్దరు వ్యక్తుల గురించి అందిన రహస్య సమాచారం ఆధారంగా ఆరా తీయడంతో గుట్టు రట్టు అయిందని కమిషనరేట్ పోలీసుల కథనం. వీరివురు భారత ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ అయిన పీకే మిశ్రాకు వరుసకు అల్లుడు, కూతురుగా స్వీయ ప్రచారం చేసుకుని పలువుర్ని మోసగించారు. ఈ మేరకు స్థానిక ఇన్ఫో సిటీ ఠాణాలో పోలీసులు ఈ నెల 26న కేసు నమోదు చేశారు. ఈ కేసుపై జరిగిన విచారణలో సాక్షుల వివరాల విశ్లేషణతో ఆరోపణలు రుజువు అయ్యాయి. నిందితులు అనిల్ కుమార్ మహంతి, హన్సిత అభిలిప్సలను ఈ నెల 29న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కమిషనరేటు పోలీసులు తెలిపారు. వీరివురి వ్యతిరేకంగా బీఎస్ఎస్ 329(3)/ 319(2)/ 318(4)(3)(5) సెక్షన్ల కింద నమోదు అయిన కేసుల కింద కోర్టు విచారణ ఆరంభమైంది.

గంజాయితో ఇద్దరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

జయపురం: స్థానిక కొత్త బస్టాండ్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. కేరళకు చెందిన వీరు ఎయిర్ బ్యాగ్‌లో గంజాయి తీసుకెళ్తున్నారని పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయ్ తెలిపారు. వీరిని కేరళకు చెందిన మహమ్మద్ అజమాల్, నౌఫుల్ నజార్‌లుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వారు కొరాపుట్ జిల్లా లమతాపుట్ నుంచి గంజాయిని కేరళకు తీసుకువెళ్తున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి 21 కేజీలు ఉందని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

శ్రీమందిరంలో.. తోపులాట

- పది మంది భక్తులకు గాయాలు
- బొడొదండొకు పోటెత్తిన జనం



బొడొదండొలో జనసందోహం





దర్శనం వరుసల్లో అదుపు తప్పతున్న దర్శనార్థులు (ఇన్‌సెట్లో) తోపులాటలో అస్వస్థతకు గురై పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి

భువనేశ్వర్:

పూరీ శ్రీ మందిరం భక్తులు, యాత్రికుల రద్దీతో కిటకిటలాడుతోంది. రద్దీ నియంత్రణ లోపించడంతో సోమవారం ఉదయం తోపులాట చోటు చేసుకుంది. ఈ సంఘటనలో 10 మంది భక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో బాలలు, మహిళలు ఉన్నారు. తక్షణమే వీరందరినీ స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఆంగ్ల సంవత్సరాది ముగింపు పురస్కరించుకుని భక్తుల తాకిడి ఊపందుకుందని అధికార యంత్రాంగం ప్రకటించింది. సుదూర ప్రాంతాల నుంచి యాత్రికుల రాక గత రెండు రోజులుగా పెరుగుతోంది. శ్రీ మందిరంలో రత్న వేదికపై స్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు లోనికి ప్రవేశించడంతో వెలుపల ప్రాంగణంలో తోపులాట చోటు చేసుకుంది. 10 మంది భక్తులు ఈ తోపులాటలో నలిగి పోయి ఉక్కిరి బిక్కిరి అయ్యారు. వీరిలో 4 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆంగ్ల నూతన సంవత్సరం సమీపిస్తోంది. దీంతో ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువ అవుతుంది. సంవత్సరం చివరిలో శ్రీ జగన్నాథుని దర్శనం కోసం రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. రద్దీ క్రమబద్ధీకరణ అదుపు తప్పింది. శ్రీ మందిరం అనుసంధాన బొడొ దండొ మార్గం మార్కెట్ కూడలి నుంచి తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేశారు.



శ్రీ మందిరానికి పోలీసు భద్రతా నిఘా

ఔట్‌పోస్టు, సీసీ కెమెరాల నిఘా

పర్యాటకుల సందర్శనతో స్థానిక సాగర తీరం రద్దీగా తయారైంది. ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. మరో వైపు శ్రీ మందిరం పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. బీచ్‌లో పర్యాటకుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ కోసం పూరీ జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. పర్యాటకుల భద్రత కోసం సముద్రంలో స్నానం చేసే సమయంలో ఆపత్కాల పరిస్థితుల్లో పర్యాటకులకు సహాయం చేయడానికి 120 మంది లైఫ్‌గార్డులు బీచ్‌లో వివిధ ప్రదేశాలలో నియమించారు. శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో తనిఖీలు ముమ్మరం చేశారు. భారీ రద్దీ కారణంగా డిసెంబర్ మంగళ వారం (ఈ నెల 31) నుంచి పట్టణంలో వాహనాల రాకపోకల రద్దీ నియంత్రణకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. భువనేశ్వర్ నుంచి వచ్చే నాలుగు చక్రాల వాహనాలు జైల్ రోడ్ పార్కింగ్ వద్ద, కోణార్క్ నుండి వచ్చే నాలుగు చక్రాల వాహనాలు తొలొబొణియా పార్కింగ్ వద్ద, బ్రహ్మగిరి నుంచి వచ్చే నాలుగు చక్రాల వాహనాలు స్టెర్లింగ్ లేదా యాత్రిక పార్కింగ్ వైపు మళ్లించి వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేశారు.

రద్దీ నియంత్రణకు చర్యలు

శ్రీ మందిరంలో స్వామి దర్శనం కోసం భక్తుల రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలకు కార్యాచరణ ఖరారు చేశారు. ప్రవేశం ఒక ద్వారం గుండా అనుమతించి 3 ద్వారాల గుండా వెలుపలకు భక్తులకు విడిచిపెడతారు. ఈ నేపథ్యంలో భక్తులు, యాత్రికుల్ని సింహ ద్వారం గుండా శ్రీ మందిరంలో దర్శనానికి అనుమతించి దర్శనం తర్వాత మిగిలిన 3 ద్వారాల గుండా వీరిని బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 30 (మంగళ) మరియు కొత్త సంవత్సరాది బుధ వారం రెండు రోజులు ఈ నిబంధన అమలులో ఉంటుందని శ్రీ మందిరం అధికార వర్గం తెలిపింది.

పోలీసు బందోబస్తు

ఆంగ్ల సంవత్సరం ఆరంభం పురస్కరించుకుని పూరీ పట్టణం పర్యాటకులు, సందర్శకులతో కిటకిటలాడుతోంది. వీరి ఆగమనంతో శ్రీ మందిరం, సాగర తీరం ప్రాంతాల్లో జన సందోహం పెరిగింది. శాంతి భద్రతల పరిరక్షణతో రద్దీ నియంత్రణ కోసం పూరీ పట్టణంలో 60 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. ఆలయ ప్రాంగణంలో రెండు అంచెల్లో పోలీసుల్ని మోహరించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో గొలుసు దొంగలపై ప్రత్యేక నిఘా ఉంటుందని అభయం ఇచ్చారు. అవాంఛనీయ పరిస్థితుల నివారణ కోసం పలుచోట్ల పోలీసులు దిగ్బంధనం చేశారు.

ఆలయంలో భద్రత

పూరీ శ్రీ మందిరంలో రద్దీతో తోపులాట నివారించేందుకు పలు అంచెల్లో భద్రత ఏర్పాటు చేశారు. ఆలయం లోపల 5 భద్రతా మండలాలు, వెలుపల 4 జోన్‌లుగా ఈ వ్యవస్థని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

నో వెహికిల్ జోన్లు

బీచ్‌లో సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించడానికి సుభాష్ బోస్ స్ట్రీట్ నుంచి లైట్ హౌస్ వరకు, పూరీ మెడికల్ కూడలి నుంచి శ్రీ మందిరం, సముద్ర తీరానికి నాలుగు చక్రాల వాహనాల రవాణా నివారణ కోసం మార్కెట్ స్ట్రీట్ నుండి నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. కంట్రోల్ రూమ్.. అన్ని కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించడానికి, నిర్వహించడానికి ట్రాఫిక్ పోలీసు ఠాణాలో రాత్రింబవళ్లు పని చేసే సమన్వయ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు చేయూత

దివ్యాంగులు, వయో వృద్ధ భక్తులు, యాత్రికలకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యువ శక్తి వలంటీర్లతో ప్రత్యేక బృందం సీనియర్ సిటిజన్లు మరియు వికలాంగ వ్యక్తుల భద్రత మరియు సౌకర్యాల్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుంది.

దట్టమైన పొగమంచు

పూరీ సందర్శిస్తున్న పర్యాటకులు చలి వాతావరణం ఆస్వాదిస్తున్నారు. వాతావరణ మార్పుతో ఉదయం పూట పొగ మంచు దట్టంగా కమ్ముకుంది. శ్రీ మందిరం శిఖరాన నీల చక్రం, పతిత పావన పతాకం పొగ మంచు చాటున స్పష్టంగా కానరావడం లేదు.

ఏనుగుల రక్షణపై అవగాహన



శిక్షణ శిబిరంలో పృష్టి మిశ్రా, చందన్, తదితరులు



శిక్షణ శిబిరంలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది

రాయగడ: జిల్లాలోని మునిగుడ అటవీ రేంజ్ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఏనుగుల సంరక్షణపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా ఏసీఎఫ్ సందీప్ కుమార్ పృష్టి, ముఖ్యవక్తగా గౌరంగ చరణ్ రవుత్, సన్మానిత అతిథులుగా గుణుపూర్ డిప్యూటీ రేంజర్ గంగాధర్ మిశ్ర, కళ్యాణసింగుపూర్ రేంజర్ చందన్ గొమాంగొ హాజరయ్యారు. అడవులు అంతరించి పోతుండటంతో ఆహారం కోసం అడవుల్లో ఉండాల్సిన ఏనుగులు గ్రామాల్లో చొరబడాల్సి వస్తుందని ఏసీఎఫ్ పృష్టి అన్నారు. ఏనుగులు గ్రామాల్లో ప్రవేశించే సమయంలో వాటి ద్వారా ఎటువంటి నష్టాలు సంభవించకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట పొలాలు, ధన, ప్రాణ నష్టాలు సంబవించకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఏనుగుల బారీ నుంచి ఎలా రక్షించుకోవాలన్న అంశంపై ఫారెస్టర్ రంజిత్ శ్రీరాం తన అనుభవాన్ని వివరించారు. ఏనుగులు రోజు, రోజుకూ అంతరిస్తున్నాయని, వాటి ఆవశ్యతకత ఎంతో ఉందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి




ర్యాలీలో పాల్గొన్న ఏఐకేఎం కార్యకర్తలు



వినతి పత్రాన్ని సబ్ కలక్టర్ కార్యాలయం సంబంధిత శాఖ అధికారికి సమర్పిస్తున్న దృశ్యం

రాయగడ: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం, పత్తి రైతులు నష్టాల బారిన పడ్డారని, చేతికి వచ్చిన పంటలు నీటి పాలయ్యాయని పంట నష్టాలను అంచనా వేసి ప్రతి బాధిత రైతుకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని ఆల్ ఇండియా కిషాన్ మోర్చా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకుడు తిరుపతి గొమాంగొ నేతృత్వంలో జిల్లాలోని గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఓ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కిషాన్ మోర్చా నాయకుడు గొమాంగొ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు ఎనలేని నష్టాలను చవి చూశారని అన్నారు. అందువల్ల ప్రభుత్వం వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీల్లో తగిన ధర ఇవ్వాలన్నారు. ధాన్యం, పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆందోళనలో భగసాల పంచాయతీ సర్పంచ్ మదన్ సబర్, బృందావన్ బిడిక, రమేష్ బిడిక, కేశవ్ సబర్, మోజేష్ సబర్, కరుణాకర్ లిమ్మ, తవుడు సబర్, రాజేంద్ర మాఝి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యత



భక్తులకు దర్శన క్రమబద్ధీకరణ పర్యవేక్షిస్తున్న పోలీసు ఉన్నతాధికారుల బృందం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానంలో ఉదయం చోటు చేసుకున్న తోపులాట సంఘటన పోలీసు యంత్రాంగాన్ని చలింప జేసింది. ఇలాంటి అవాంఛనీయ సంఘటనల నివారణకు క్రమబద్ధీకరించిన వరుస విధానంపై ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీ సీఆర్ చరణ్ సింగ్ మీనా, పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు వినీత్ అగర్వాల్ భక్తులు గుమిగూడే బొడొదండొ ఆవరణలో వరుస వ్యవస్థని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు సంబంధించి అనుబంధ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సూచనలు జారీ చేశారు.

సమాజ చైతన్యమే సినిమాల లక్ష్యం



కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న మహిళ

వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళలు


జయపురం: సమాజ చైతన్యమే సినిమాల లక్ష్యం కావాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినీపతి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక జ్యోతి కల్యాణ మండపంలో జరిగిన బజరంగ క్రియేషన్ 7 వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భజరంగ క్రియేషన్ చైర్మన్, దర్శకులు ఐ.గోపాల పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవం ఆయన ప్రసంగిస్తూ స్థానిక కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా గోపాల పట్నాయిక్ మాట్లాడుతూ ఇంతవరకు భజరంగ క్రియేషన్ బ్యానర్‌పై తెలుగు, ఒరియా, హిందీ, దేశీయ భాషల్లో 32 చిత్రాలు తీశామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియ ప్రతినిధులు టి.గౌరీశంకర్, మనోజ్ దాస్, పద్మనాభలను సత్కరించారు.

పనిచేయని టికెట్ బుకింగ్ యాప్

- అంతర రాష్ట్ర ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్న ఓఎస్‌ఆర్టీసీ



రాజమండ్రి కాంప్లెక్స్‌లో ఒడిశా వైపు వెళ్లే బస్సుల వివరాలు లేని బోర్డులు



కొరాపుట్: ఓఎస్‌ఆర్టీసీ అధికారిక టికెట్ బుకింగ్ యాప్ మొరాయించడంతో అంతర రాష్ట్ర ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ యాప్ ద్వారా బస్ టికెట్లు బుక్ చేసుకోవడానికి సుదూర ప్రాంత ప్రయాణికులు అలవాటు పడ్డారు. బస్సు ఎన్ని గంటలకు, ఏ ప్లాట్ ఫాంలలో నిలుపుతారో తెలుసుకొనేవారు. గత నెల రోజులుగా ఈ యాప్‌ను అభివృద్ధి పేరిట నిలుపదల చేశారు. ఒడిశా నుంచి ఆంధ్ర ప్రదేశ్ వెళ్లే వారికి కష్టాలు పెరిగాయి. విజయనగరం, విశాఖపట్నంలలో ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో ఓఎస్‌ఆర్టీసీకి ప్రత్యేక టిక్కెట్ బుకింగ్ కౌంటర్లు ఉండడంతోపాటు ఒడిశాకు వెళ్లే బస్సులు నిలిపే ప్లాట్ ఫాం వివరాలు బోర్డు మీద ఉంటాయి. దీంతో కాస్తా ఉపశయనం లభిస్తుంది. కానీ ఆంధ్రలో మిగతా ఎక్కడా కూడా ఓఎస్‌ఆర్టీసీ కౌంటర్లు లేవు. శ్రీకాకుళం, రాజమండ్రి, విజయవాడ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా పట్టణాలకు ఓఎస్‌ఆర్టీసీ బస్సులు నడుపుతుంది. రాజమండ్రిలో ఒడిశా బస్సులు నిలిపే ప్లాట్ ఫాం వివరాలు కనీసం బోర్డు మీద ఉంచడం లేదు. ఒడిశా ప్రయాణికులు విశాఖపట్నం బస్సులు ఉంచే ప్లాట్ ఫాం వద్ద పడిగాపులు కాస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందంలో భాగంగా ప్రభుత్వ బస్సు కాంప్లెక్సుల వద్ద ఇరు రాష్ట్రాల ప్రభుత్వ బస్సులు నిలిపేందుకు హక్కు ఉంది. బస్సుల వివరాలు కాంప్లెక్స్‌ల్లోని బోర్డుపై పెట్టే అవకాశం ఉంది. ఒకవైపు యాప్ పని చేయకపోవడం, మరోవైపు ప్రధాన నగరాలులో బస్సులు నిలుపుదల చేసే ప్లాట్ ఫాం వద్ద పేర్లు లేకపోవడంతో అంతర రాష్ట్ర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

క్లుప్తంగా

బీజేపీలోకి రబి గొమాంగొ


రబి గొమాంగొ

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి అధ్యక్షుడు రబి గొమాంగొ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆయన 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో గత పంచాయతీ ఎన్నికల్లో రామనగుడ నుంచి పోటీ చేసిన ఆయన సమితి అధ్యక్షుడిగా గెలిపొందారు. పార్టీ తనకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో బీజేపీలోకి చేరినట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

కారు బైక్ డీ: ఒకరు మృతి


సంఘటన స్థలంలో పడి ఉన్న రామ మృతదేహన్ని తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

మల్కన్‌గిరి: పోడియా సమితిలో సోమవారం తెల్లవారుజామున పోడియా–శిమిలిబంచ్ గ్రామం మధ్య గల రహదారిపై కారు బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై బాడసి రామ అనే ఉన్న వ్యక్తి మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. మృతదేహన్ని పోలీసులు కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గాయపడిన వ్యక్తికి కలిమెలలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


పి.రోహిత్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి పి.రోహిత్ రాష్ట్రస్థాయి క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. జనవరి ఐదో తేదీన భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రోహిత్‌ను సత్కరించనున్నారని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. రోహిత్ తండ్రి పి.త్రినాథ్‌కూడ టైలరింగ్ చేస్తూ వచ్చే ఆదాయంతో కుమారుడిని చదివిస్తున్నారు.

సీఏఎస్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఒక సీనియర్ ప్రొఫెసర్, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్ల ఉద్యోగ ఉన్నతులకు సంబంధించి సోమవారం జరగాల్సిన సీఏఎస్ (కెరియర్ అడ్వాన్స్ స్కీమ్) ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. అధికారులు నిర్వహణకు ముందుకు వచ్చినా, చివరి క్షణంలో ఉన్నత విద్యాశాఖ ఇంటర్వ్యూలు వాయిదా వేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. పాలక మండలి అనుమతులు లేకుండా ఇంటర్వ్యూలకు అధికారులు సిద్ధపడడం, సీనియర్ ప్రొఫెసర్ సీఏఎస్‌లో నిబంధనలు అమలు చేయటం లేదంటూ విద్యాశాఖకు అధిక సంఖ్యలో విశ్వవిద్యాలయ పరిరక్షణ కమిటీ పేరుతో ఫిర్యాదులు వెళ్లాయి. సీఏఎస్ ఇంటర్వ్యూలు పూర్తయినా పాలక మండలి, ఉన్నత విద్యాశాఖ అనుమతుల తర్వాతే ఉద్యోగ ఉన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం వర్సిటీలో అకడమిక్ సెలవులు కొనసాగుతున్నాయి. అయినా సీఏఎస్ ఇంటర్వ్యూల నిర్వహణకు అధికారులు సిద్ధపడ్డారు.

నూతన విధానాలు అవలంబించాలి

ఆమదాలవలస: నూతన ఆక్వా కల్చర్ విధానాలను అవలంభించి, వాతావరణంలో మార్పులతో వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించడం, నివారణ చర్యను చేపట్టడంపై మత్స్యకార రైతులు అవగాహన కలిగి ఉండాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సౌజన్యంతో కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో సోమవారం మత్స్యశాస్త్రం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు, రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పద్ధతులను విడిచి, సాంద్ర పద్ధతుల్లో సాగు చేపట్టినట్లయితే అధిక దిగుబడుల సాధించడం సాధ్యమవుతుందన్నారు. వీటికి అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో వినూత్న చేపల పెంపక విధానాలైనటువంటి చేపల పెంపకం విధానం హర్ష ఆక్వాకల్చర్ యూనిట్ సందర్శించారు.

ఆరుగురిపై గృహ హింస కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని బడివానిపేట పంచాయతీ జాలారుకొయ్యాం గ్రామానికి చెందిన మహిళ మారుపల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఎచ్చెర్ల పోలీసులు ఆరుగురిపై గృహహింస కేసు నమోదు చేశారు. ఈమె భర్త సత్యం కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ప్రస్తుతం అత్త టిట్టమ్మ, మరో ఐదుగురు కుటుంబ సభ్యులు రోజూ హింసిస్తున్నారని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

వైభవంగా గాయత్రీ మహాయజ్ఞం


గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభిస్తున్న అతిథులు


కలశాలతో మహిళలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి పోడ్‌ఘాటీ పంచాయతీలోని ఆశ్రమ పాఠశాల ఆవరణలో సోమవారం హరిద్వార్ అఖిల భారత గాయత్రి సంఘం తరఫున 108 కలశాలతో గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. మంగళవారం వరకు యజ్ఞం జరుగుతుందని నిర్వాహకులు తెలిపాఉ. ఖోయిర్‌పూట్ సమితిలో ఉన్న డమార్డీ నాదీ నుంచి కలశాలతో నీటిని సేకరించి ఏడు కిలో మీటర్ల దూరం యాత్ర నిర్వహించారు. చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో, చిత్రకొండ మాజీ ఎమ్మెల్యే డొంబురు సీసా, ఖోయిర్‌పూట్ సమితి సభ్యులు బిఘున్ కిర్షనీ, హరిద్వార్ నుంచి వచ్చిన రజిత్ కుమార్ షాడాంగీ, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పంట నష్టం బీమా దాఖలు గడువు పొడిగింపు

భువనేశ్వర్: అకాల వర్షాలతో సంభవించిన పంట నష్టం వివరాలు బీమా సంస్థలకు దాఖలు చేసే గడువుని పొడిగించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం జనవరి నెల 1వ తేదీ వరకు ఈ వివరాలు దాఖలు చేసేందుకు గడువు పొడిగించారు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సాధికారిత విభాగం ఆమోదించినట్లు సోమవారం ప్రకటించారు. సుమారు 10 రోజులపాటు తెరిపి లేకుండా కురిసిన అకాల వానలు వరి పంటని తీవ్రంగా ప్రభావితం చేశాయి. చిట్ట చివరి దశలో పంట నీట మునిగింది. మరో వైపు క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనా ప్రక్రియ ఇంత వరకు ఊపందుకోలేదు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 29 సరికి బీమా సంస్థలకు పంట నష్టాన్ని నివేదించడం వీలుకానందున పొడిగింపు అనివార్యమైంది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రత్యక్షంగా ప్రభావిత పంట పొలాల్ని సందర్శించిన మేరకు బీమా సంస్థలకు పంట నష్టం వివరాలు దాఖలు చేసే గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థించారు.

ప్రజాభియోగ శిబిరంలో 12 వినతులు స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

జయపురం: జయపురం సమితి పంపుణీ గ్రామ పంచాయతీలో సోమవారం ప్రజాఅభియోగ శిబిరాన్ని నిర్వహించారు. జయపురం సమితి అదనపు బ్లాక్ డవలప్‌మెంట్ అధికారి మనోజ్ కుమార్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 12 వినతులను అదనపు బీడీవోకు ప్రజలు లిఖిత పూర్వకంగా అందజేశారు. వీటిని పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని మనోజ్ కుమార్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఏబీడీవో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, రైతుల సమస్యలు, గ్రామీణ రహదారులు, ఆవాస యోజన, మొదలగు సమస్యలపై ప్రజల ముందు చర్చించి వాటిని పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. జయపురం జీపీవో భగీరధి నాయక్, సర్పంచ్ శివ భూమియ, రూరల్ వాటర్ సప్లై శానిటరీ విభాగ ప్రభుత్వ ఇంజినీర్ రంజిత రాణి పండ, సమితి జూనియర్ ఇంజినీర్ సంతోష్‌కుమార్ మహంతి, పీఈవో కృష్ణ చంద్రపాత్రో, సమితి సమాజ సేవా అధికారి నిశా నాయక్, అదనపు బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి ఆర్.కె.రావు పాల్గొన్నారు.

పొగమంచు హెచ్చరిక జారీ

భువనేశ్వర్ : గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో వాతావరణంలో తరచు భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులతో చలి సాధారణ జన జీవనం ప్రభావితం చేస్తుంది. తాజాగా పొగ మంచు వాతావరణంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రహదారులపై వాహనాలు నడిపే వ్యక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రత్యేక సహాయ కమిషనరు కార్యాలయం ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో 4 జిల్లాల్లో పొగమంచు దట్టంగా కమ్ముతుందని భారత వాతావరణ శాఖ పసుపు హెచ్చరిక జారీ చేసింది. రహదారి ప్రమాదాలను నివారించడానికి జాతీయ రహదారులపై పొగమంచు ఉన్న సమయంలో సురక్షితంగా డ్రైవింగ్ చేయాలని స్పెషల్ రిలీఫ్ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పోలీసు, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో అనుబంధ పరిస్థితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపింది.


వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం మంగళవారం ఝార్సుగుడ, సంబల్‌పూర్, కెంఝొహర్ మరియు సుందర్‌గడ్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల పొగమంచు దట్టంగా కమ్మే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేశారు. కంధమల్ మరియు కలహండి జిల్లాల్లో ఒకటి లేదా రెండు ప్రదేశాలలో తేలికపాటి నుండి మోస్తరుగా పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. వాతావరణ శాఖ హెచ్చరికను దృష్టిలో ఉంచుకుని పొగమంచు దట్టంగా ఉన్న సమయంలో హైవేలపై వాహనాలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఐఎండీ కోరింది.

దళిత మహిళల్ని వేధించిన నిందితులు అరెస్టు


స్తంభానికి కట్టి ఇద్దరు మహిళల్ని చితక బాదుతున్న దృశ్యం

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ఇద్దరు దళిత మహిళల్ని స్తంభానికి కట్టివేసి దాడికి పాల్పడ్డారు. మత మార్పిడి చర్యలకు పాల్పడుతున్నారన్న నెపంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ అధికార ప్రతినిధి, మహిళా నేత్రి డాక్టరు లేఖశ్రీ సామంత సింగార్ ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో నేరపూరిత కార్యకలాపాలు రాజ్యమేలుతున్నాయని అన్నారు. బాలాసోర్ జిల్లాలో దళిత మహిళలపై దాడి సంఘటనపై బీజేడీ నిజ నిర్ధారణ కమిటి ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించి వాస్తవ పరిస్థితుల్ని సమీక్షించిందన్నారు. ఈ జిల్లా నీలగిరి ప్రాంతంలో ప్రజల్ని భయపెట్టి స్వేచ్ఛ లేని జీవనానికి పరిమితం చేసిన సంఘటనలు తాండవిస్తున్నాయని ఆమె ఆరోపించారు. దళిత మహిళలపై దాడికి పాల్పడిన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఇద్దరు దళిత మహిళలపై జరిగిన అమానుష దాడికి సంబంధించిన కేసులో 3 మంది నిందితుల్ని అరెస్టు చేసినట్లు బాలాసోర్ జిల్లా పోలీసు సూపరింటెండెంటు రాజ్ ప్రసాద్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి రెముణా ఠాణాలో కేసు నమోదు అయింది. ఈ ఫిర్యాదు ఆధారంగా నిందతుల్ని అరెస్టు చేసి వారి వ్యతిరేకంగా కేసులు నమోదు కావడంతో విచారణ కోసం న్యాయ స్థానానికి సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు.

కలిమెల సమితిలో.. శీతాకాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


తలపడుతున్న క్రీడాకారులు


విజేతగా నిలిచిన బ్లాక్ కోబ్రా జట్టు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి యం.వి.79 గ్రామం వద్ద ఐటీసీ మిషన్ సురహేరా కాల్ సహకారంతో ఐజీడీకి చెందిన ఎన్జీవో ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం నిర్వహించారు. ఆల్ స్టార్స్, బ్లాక్ కోబ్రా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. బ్లాక్ కోబ్రా మొదట బ్యాటింగ్ చేసి 175 పరుగులు చేయగా.. ఆల్‌స్టార్స్ ఒక ఓవర్ ఉండడగానే ఆలవుట్ అయింది. విజేతగా బ్లాక్‌కోబ్రా జట్టు నిలిచింది. అతిథులుగా జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధి మానస్ రంజాన్ జేనా, శంకార్ బర్మన్, సినియర్ క్రీడాకారుడు రంజిత్ కుమార్ మహరాణ హాజరయ్యారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సంజీవ్ హల్దర్, అంపైర్లుగా ఇంద్రజిత్ సర్కార్, సుదీప్ దత్త వ్యవహరించారు. విజేతలకు ట్రోఫీని అందజేశారు.

చిత్రకొండ సమితి గ్రీవెన్స్‌లో 52 వినతుల స్వీకరణ


జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు సమస్యలను చెప్పకుంటున్న దంపతులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌సెల్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 వినతులు అందాయి. సమస్యలు పరిష్కరించాలని స్వచ్ఛంద సంస్థల మహిళలు వినతులు అందించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని పప్పులూర్, కూర్మానూర్, కప్పతోట, నూవగూఢ, చిత్రకొండ, గూంతబేఢ, టోనాల్‌కాంప్ పంచాయతీలకు చెందిన గిరిజనులు కలెక్టర్‌కు వినతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, జిల్లా అదనపు ఎస్పీ తాపాన్ నారాయణ్ రోతో, మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ దూరోధ్యన్ బోయి, చిత్రకొండ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి రంప పంచాయతీలో సోమవారం గ్రామ ముఖిపరిపాలన, గ్రీవెన్స్ సెల్‌కు విశేష స్పందన లభించింది. ఈ గ్రీవెన్స్ సెల్‌కు కలెక్టర్ బిజయకుమార్ దాస్ అధ్యక్షత వహించారు. జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, బీడీఓ గౌరచంద్ర పట్నాయక్, గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు హాజరయ్యారు. రంప గ్రామ పంచాయతీలోని శోబర, లాబణ్యగడ నుంచి మొత్తంగా 95 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 75, గ్రామ సమస్యలు 20 ఉన్నాయి. 7 ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రీవెన్స్ సెల్‌కు తహసీల్దార్ నారాయణ బెహరా, ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో, డీఎస్ఎస్ఓ సంతోష్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతుప్ప సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి

జయపురం: సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతున్నాయని.. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి సూచించారు. సోమవారం సదర్ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర తండి మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూతన సంవత్సరం వేడకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని.. పోలీసులతో పాటు సమితి సభ్యులు కూడా సహకరించాలన్నారు. నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో జయపురం పట్టణ పోలీసు అధికారి రమణి రంజన్ దొలాయి, సబ్‌ఇన్‌స్పెక్టర్ సులోచన ప్రధాన్, అంబాగుడ పోలీసు సంటి అధికారి మనువ బిడిక, బసంతి నాయక్, సుశాంత దలపతి, అభిమణ్యు పట్నాయక్, శరత్ కుమార్ తరిణి, ధనేష్ ఖిముండు, సవిత నాయక్, తిలోత్తమ చింద్రిక, భాస్కర పట్నాయక్, మకరధ్వరు హరిజన్, జగన్నాథ్ హరిజన్ పాల్గొన్నారు.

పుషపుణి మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పుషిపుణి మహోత్సవం పోస్టర్‌ను విడుదల చేసిన కళాకారులు లింగరాజ్ మిశ్ర


పుషపుణి మహోత్సవ పోస్టర్

జయపురం: జనవరి 13 నుంచి 20వ తేదీ వరకు జయపురంలో కొరాపుటియ కళ, కళాకార బృందం నిర్వహించనున్న 'పుష పుణి' మహోత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కొరాపుటియ కళ, కళాకార అధ్యక్షుడు మనోజ్ కుమార్ పాత్రో అధ్యక్షతన స్థానికంగా ఒక కళ్యాణ మండపంలో ప్రముఖ కళాకారులు లింగరాజ్ మిశ్ర ముఖ్యఅతిథిగా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. పుష పుణి మహోత్సవ ప్రారంభ దినాన కళాకారులతో నిర్వహించే ర్యాలీలో పాల్గొనేందుకు కళాకార బృందాలను ఆహ్వానించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారుడు ధిరెన్‌మోహణ పట్నాయక్ ,రబి పాత్రో, నాటక కళాకారుడు గోపాల సామంతరాయ్, రామనాథ్ త్రిపాఠీ, జయంతి శాంత, సంతోష్ దాస్, మహమ్మద్ షరీఫ్, పద్మిణీ సామంతరాయ్, శుక్ల దేవనాథ్, స్వర్ణలత పండ, గుప్త పాణిగ్రహి, కష్ణ కేశవ షాడంగి, శ్రీకాంత దాస్ పాల్గొన్నారు.

గిరిజన బాలలకు చేయూత


గిరిజన విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సుదర్శన్ పూజారి తదితరులు


భోజనం చేస్తున్న శిక్షణకులు

కొరాపుట్: గిరిజన బాలలు ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కోసం ఒక సంఘ సేవకుడు చేస్తున్న కృషి సర్వత్రా అభినందనలు అందుకుంటుంది. నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి మెదన గ్రామ పంచాయతీ చటిగుడ గ్రామానికి చెందిన సంఘ సేవకుడు సుదర్శన్ పూజారి జీవితం ఆదర్శ ప్రాయం. ఆ ప్రాంతంలో గిరిజన బాలలు నవోదయ, ఆదర్శ విద్యాలయాలో ప్రవేశం కోసం ప్రయత్నం చేస్తుంటారు. కానీ పేదరికం, వెనుకబాటు తనంతో అవకాశాలు సాధించలేక పోతున్నారు. ఇది గ్రహించిన సుదర్శన్ పూజారి తన ఐదుగురు మిత్రులతో కలసి వీరికి బోధనలు చేస్తున్నారు. సుమారు 70 మంది గిరిజన విద్యార్థులకు ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఆదివారం సమీప ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శిక్షణ ఇస్తున్నారు. ఉచిత బోధనతో పాటు విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నారు.

పంట నష్ట పరిహారం చెల్లింపులో జాప్యం తగదు


పంట నష్టం పీడిత రైతాంగం మధ్య విపక్ష నేత నవీన్ పట్నాయక్


పంట నష్టం రైతుల గోడు ఆలకించిన నవీన్ పట్నాయక్

భువనేశ్వర్ : అకాల వర్షాలతో పంట నష్టం బారిన పడిన పీడిత రైతాంగం బాగోగుల్ని ప్రత్యక్షంగా సమీక్షించేందుకు ప్రతిపక్ష నాయకుని హోదాలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా సోమవారం గంజాం జిల్లా సెరొగొడా, హింజిలి, అస్కా, కవిసూర్యనగర్ ప్రాంతాలు సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో అకాల వర్షం కారణంగా సంభవించిన పంట నష్టాన్ని పరిశీలించారు. నవీన్ పట్నాయక్ రాకతో పీడిత రైతాంగం వరి కంకులతో ఆయనను చుట్టుముట్టింది. పరిహారం మంజూరు కాక తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు వారు గోడు వినిపించారు. వీరి గోడు పట్ల నవీన్ పట్నాయక్ స్పందించారు. పీడిత రైతాంగానికి పంట నష్టం పరిహారం చెల్లింపులో జాప్యం ఎంత మాత్రం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు. అకాల వర్షాలతో ఘోరంగా పంట దెబ్బతిందని విచారం వ్యక్తం చేశారు. తన ప్రభుత్వ హయాంలో మాదిరిగానే రైతులకు త్వరగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు క్లీనర్ మృతి

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమలో లారీలో కోళ్ల మేత అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడి లారీ క్లీనర్ దువ్వు రమణ(36) మృతి చెందినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు. ఈ నెల 25న సాలూరు నుంచి లారీలో కోళ్ల మేతను డ్రైవర్ మహంతి బాలు, క్లీనర్ దువ్వు రమణలు తీసుకొచ్చారు. పరిశ్రమ వద్ద అన్‌లోడ్ చేసేందుకు క్లీనర్ రమణ కట్లు విప్పుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమవడంతో విజయనగరంలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్టణంలోని షీలానగర్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. చికిత్స పొందుతూ రమణ ఈ నెల 29న మృతి చెందినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడు రమణ అవయవాలను కూడా ఆంధ్రా మెడికల్ కళాశాలలో దానం చేసినట్లు హెచ్‌సీ రమణ తెలిపారు.

ఆరుగురికి తీవ్రగాయాలు

- కారు, ఆటో, బైక్ ఢీకొనడంతో ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గంట్యాడ: మండలంలోని కొర్లాం, తామరపల్లి గ్రామాల మధ్యలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోనంగి, మదనాపురం, ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వారు పనులు ముగించుకుని సోమవారం రాత్రి ఆటోలో స్వగ్రామాలకు వెళ్తుండగా అరకు నుంచి వస్తున్న ఓ కారు ఆటోను, ఆటో పక్కన వెళ్తున్న బుల్లెట్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బుల్లెట్‌పై వెళ్తున్న కానిస్టేబుల్ కింద పడిపోయాడు. అదే విధంగా ఆటోలో ఉన్న నలుగురికి కారులో ఉన్న ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు స్పందించి 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నలుగురిని తరలించగా, ఇద్దరు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ ప్రమాదంలో బోనంగి గ్రామానికి చెందిన జుత్తాడ సత్యారావు, జుత్తాడ గణేష్, మదనాపురం గ్రామానికి చెందిన నక్కెల సింహాద్రి నాయుడు, ధర్మవరం గ్రామానికి చెందిన దేవుపల్లి సన్యాసిరావులకు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా కొర్లాం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పాశల శ్రీను బొడ్డవర చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించేందుకు వెళ్తుంగా కారు ఢీకొట్టడంతో మూడు పల్టీలు కొట్టి కింద పడిపోగా తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో కానిస్టేబుల్‌ను విజయనగరంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మరో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాత్రి వేళ ప్రమాదం జరగడంతో అ ప్రాంతంలో క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. సమాచారం మేరకు విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, గంట్యాడ ఎస్సై సాయికృష్ణలు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు. అనంతరం గంట్యాడ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1.5 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్



చెరకును తరలించేందుకు సిద్ధంచేస్తున్న రైతులు

రేగిడి: సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు ఏవీపీ పట్టాభిరామిరెడ్డి సోమవారం తెలిపారు.వర్షాలు కారణంగా వారం రోజుల పాటు చెరకు క్రషింగ్ నిలుపుదలచేశామన్నారు. ప్రస్తుతం వాతావరణం అను కూలంగా ఉండడంతో రైతులకు కటింగ్ ఆర్డర్లు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు 3 వేల మెట్రిక్ టన్నుల చెరకు గానుగ ఆడుతున్నామన్నారు. కర్మాగారానికి చెరకును తరలించిన వారంరోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నట్టు వెల్లడించారు.

చదురుగుడికి పెదపోలమాంబ

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెద పోలమాంబ సోమవారం గ్రామానికి చేరుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా పెద పోలమాంబ అమ్మవారిని రాత్రి ఎనిమిది గంటల సమయంలో గ్రామంలోకి ఆహ్వానించారు. ముందుగా అమ్మవారికి శీబిల్లిపెద్దవలస రోడ్డు వద్ద పూజారి కుటుంబీకులు, రివున్నాయుళ్లు, గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు కోలాట ప్రదర్శనలు, మేళతాళాల నడుమ అమ్మవారిని చదురుగుడికి తీసుకొచ్చారు. గ్రామ మహిళలు దారిపొడవునా అమ్మవారి ఘటానికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. మంగళవారం నుంచి పెద్దమ్మవారు వారం రోజుల పాటు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. జనవరి 6న తోలేళ్ల ఉత్సవం, 7న పెద్ద పండుగ, 8న అనుపోత్సవం నిర్వహిస్తారు. జనవరి 8న చినపోలమాంబను గ్రామంలోకి తెచ్చేందుకు చాటింపు వేస్తారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.వి.సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంజి కాశినాయుడు, పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సంవత్సరం	ఆరోగ్యశ్రీరోగుల సంఖ్య	వెచ్చించిన నిధులు
2019-20	31,357	రూ.73.06 కోట్లు
2020-21	35,776	రూ.84.69 కోట్లు
2021-22	62508	రూ.123.59 కోట్లు
2022-23	61053	రూ.123.61 కోట్లు
2023-24	65374	రూ.126.75 కోట్లు

- ఆ స్థానంలో బీమా కంపెనీని తీసుకువచ్చే ప్రయత్నం
- పథకంలో 3257 వ్యాధులకు చికిత్స



ఆరోగ్యశ్రీనెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు

పేదలకు ఆరోగ్యశ్రీ దూరం..!

విజయనగరం ఫోర్ట్:



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎస్.సత్యం. ఇతనిది విజయనగరం మండలం కోరుకొండ పాలెం గ్రామం. ఈ వ్యక్తికి కంటి శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ప్రభుత్వం సర్వజన ఆస్పత్రిలో చేసింది.



ఈ వ్యక్తి పేరు ఎస్. సత్యనాసయ్య. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ఇతని అమ్మకి సెల్యూలైటిస్ రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఇతని అమ్మ ఆరోగ్యం బాగానే ఉంది.

ఇలా వీరిద్దరికే కాదు. అనేక మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్‌వైద్య సేవ) పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రెండులక్షలకు పైగా ప్రజలు ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.537 కోట్ల వరకు వెచ్చించింది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు కార్పొరేట్ ఆస్పత్రులు సైతం పిలిచి మరీ వైద్యం చేసేవి. అటువంటి బృహత్తర ఆరోగ్య శ్రీ పథకాన్ని పేదలకు దూరం చేసే కుట్రను కూటమి సర్కార్ చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో బీమా కంపెనీని తెచ్చే ప్రయత్నంలో కూటమి సర్కార్ ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే రోగుల ఆరోగ్యానికి భద్రత కరువవుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ



నెట్ వర్క్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య మిత్రలు

పథకం ద్వారా జిల్లాలో 3257 వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. అయితే వ్యాధుల సంఖ్యను కూడా కూటమి ప్రభుత్వం పెంచే ఆలోచన చేయలేదు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల్లోనూ ఆందోళన

ఆరోగ్యశ్రీ రోగులతో పాటు ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంది. ఆరోగ్యశ్రీ పథకం తీసివేస్తే తమను కొనసాగిస్తారా? లేదా తీసివేస్తారో? ఏమోనని

వైద్యం ఖర్చు రూ. 1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు

వైద్యం ఖర్చు రూ.1000 దాటితే చాలు ఆరోగ్యశ్రీ వర్తిస్తుండంతో అధికశాతం మంది ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ పథకం ఉండేది కాదు. వాటికి కూడా ఆరోగ్యశ్రీ పథకాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వర్తింపజేసింది. కేన్సర్, గుండెజబ్బులకు ఎన్ని లక్షలు ఖర్చయినా వైద్యం చేయించారు. ఆరోగ్యశ్రీ పథకం లేనప్పుడు, పేద, మధ్యతరగతి వర్గాల వారు అప్పులు చేయడం, ఇల్లుగాని, భూమిగాని తాకట్టు పెట్టుకుని చికిత్స చేయించుకునేవారు.

ఆరోగ్య ఆసరాకు మంగళం

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్సఅనంతరం ఇచ్చే భృతి ఆరోగ్య ఆసరాకు కూడా మంగళం పాడేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఆరోగ్యశ్రీ రోగులకు ఆరోగ్య ఆసరా కింద డబ్బులు జమ కావడం లేదని రోగులు చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు 28 ఉన్నాయి. గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం ప్రాంతీయ ఆస్పత్రి, ఎస్.కోట ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీ బాడంగి, సీహెచ్‌సీ భోగాపురం, సీహెచ్‌సీ బొబ్బిలి, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ నెల్లిమర్ల ,ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాఆస్పత్రి, అభినవ ఆస్పత్రి (ఎస్.కోట), కొలపర్తి ఆస్పత్రి (ఎస్.కోట), సాయి పీవీఆర్ ఆస్పత్రి (విజయనగరం) శ్రీ సాయి సూపర్ ఆస్పత్రి, వెంకట రామ ఆస్పత్రి, ఆంధ్ర ఆస్పత్రి, మారుతి ఆస్పత్రి, పీజీ స్టార్ ఆస్పత్రి స్వామి ఐ ఆస్పత్రి, మిమ్స్, నెఫ్రొప్లస్, మువ్వ గోపాల ఆస్పత్రి, గాయత్రి, పుష్పగిరి ఆస్పత్రి, తిరుమల మెడికవర్ ఆస్పత్రి, శ్రీనివాస నర్సింగ్ హోమ్, జీఎంఆర్ కేర్ ఆస్పత్రి, అమృత ఆస్పత్రి ఉన్నాయి.

2,50,068 మందికి చికిత్స

జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకు 2,50,068మందికి చికిత్స అందించారు. ఇందుకోసం రూ.531.07 కోట్లు వెచ్చించారు. ఏటా 40 వేల నుంచి 60 వేల మంది వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారు.

అత్యాచారాల కేసులు సత్వరమే పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలపై నమోదైన కేసులు సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులస్తులకు సంబంధించిన కనీస హక్కులను కాపాడవలసిన బాధ్యత అధికారులందరిపైనా ఉందన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందని తెలిపారు. వారి రక్షణ కోసం రూపొందించిన చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలపై కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ స్పందించి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కాలనీలలో ఆక్రమణకు గురైన శ్మశానాలు, భూ సమస్యలను గుర్తించి 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆర్‌డీఓలకు సూచించారు. ఈ సమస్యలపై స్థానిక ఎస్సై, తహసీల్దార్, సర్వేయర్ ముగ్గురూ కలిసి తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

ప్రతి నెలా సివిల్ రైట్స్ డే

అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించాలని సభ్యులు చిట్టిబాబు, సూర్యనారాయణ కలెక్టర్‌ను కోరగా చట్టంపై అవగాహన కలిగించేందుకు ప్రతి నెల 30న మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇకపై ఆ మినిట్స్ కాపీని కూడా కమిటీ సభ్యులకు అందజేయనున్నట్లు తెలిపారు. కోర్టులో 251 కేసులు పెండింగ్ ఉన్నాయని, అవి సత్వరమే డిస్పోజ్ అయ్యేలా చూడాలని పీపీని కోరారు. అందుకు అవసరమైన సాక్ష్యాలను వేగంగా సమర్పించాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, సభ్యులు పి.చిట్టిబాబు, బసవ సూర్యనారాయణ, సున్నపు రామస్వామి, చంపి సన్యాసిరావు, మజ్జి గణపతి, ఎస్సీ ఎస్టీలతో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రెడ్డి రాజగోపాల్ నాయుడు, ఎం.రాము, అధికారిక సభ్యులు మత్స్యశాఖ డీడీ నిర్మలకుమారి, ఏపీజీఎల్ఐ ఏడీజీ హైమవతి, ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

సాలూరు: వచ్చే నెల 5వ తేదీన సాలూరులో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడిసంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా పత్రికలను ఆవిష్కరించారు వచ్చే నెల 5న పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ అంబులెన్సులను ఆపితే చర్యలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద రోగులను ఏమార్చి ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రైవేటు అంబులెన్సు సిబ్బంది తరలిస్తున్నారనే ఆరోపణలపై సాక్షిలో ఈనెల 24వతేదిన 'ప్రైవేట్ అంబులెన్సుల నిర్వాహకుల దందా' శీర్షికన ప్రచురించిన కథనానికి రవాణాశాఖ అధికారులు స్పందించారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ అంబులెన్సుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలోకి వచ్చే ప్రభుత్వ అంబులెన్సులను ఆపితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ హెచ్చరించారు. కిలోమీటరును బట్టి అంబులెన్సులకు రేటు తీసుకోవాలని ఆదేశించారు.

పోలమాంబ జాతర వైభవంగా నిర్వహిద్దాం

- అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి సంధ్యారాణి
- పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ



పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి



జాతర రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి పండగ రాష్ట్ర పండగా కావడంతో జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా సమష్టికృషితో పనిచేద్దామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర గ్రామంలో సోమవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన పోలమాంబ అమ్మవారి జాతరపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి సంధ్యారాణి ముందుగా చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ మంత్రి సంధ్యారాణిని సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం చదురుగుడి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి సంధ్యారాణి పరిశీలించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించాలని మంత్రి సంధ్యారాణి అధికారులకు సూచించారు. ఆర్టీసీ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మెడికల్ అండ్ హెల్త్, విద్యుత్‌శాఖ అధికారులతో మంత్రి సంధ్యారాణి సమీక్ష చేశారు. జాతరకు సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, ఎస్.కోట, పాలకొండ డిపోల నుంచి 66ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. జాతర మూడురోజులే కాకుండా, జాతరకు ముందు, తరువాత ఆదివారం, బుధవారాల్లో కనీసం 20బస్సులు నడపాలని మంత్రి సంధ్యారాణి ఆదేశించారు. అలాగే మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ పక్కాగా అమలుచేయాలని చెప్పారు. తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేయాలన్నారు. శంబరపోలమాంబ అమ్మవారి జాతరతో పాటు, చుట్టుపక్కల 14గ్రామాల్లో గ్రామదేవతల పండగలు ఆదే సమయంలో జరగనున్నాయని, మక్కువ మీదుగా ఆయా గ్రామాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పంపించే ఏర్పాట్లు పోలీస్‌శాఖ చేపట్టాలని మంత్రి సంధ్యారాణి సూచించారు. అలాగే 8చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. మక్కువ, చిన భోగిలి రహదారుల మధ్య గోతులను పూడ్చివేయించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు మంత్రి సంధ్యారాణి సూచించారు.

జాతరను ఘనంగా నిర్వహించుకుందాం

జాతరను ఘనంగా నిర్వహించుకుందామని కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జాతరలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. పారిశుద్య నిర్వహణ ఎప్పటికప్పుడు జరిపించాలని చెప్పారు. వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ సమీపంలో గజఈతగాళ్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్‌స్థలాలు ఏర్పాటుచేయాలని, అందుకోసం రహదారుల మలుపుల వద్ద తుప్పలు తొలగించాలని చెప్పారు. జాతరకు వచ్చే భక్తులకు మెండుగా సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. జాతర రోడ్డుమ్యాప్‌ను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డిలు పరిశీలించారు.

జాతరలో 500మంది పోలీస్‌బందోబస్తు

పోలమాంబ అమ్మవారి జాతరలో 500మందికి పైగా పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సీసీ కెమెరాలు, కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. అనంతరం పోలమాంబ అమ్మవారి జాతర వాల్ పోస్టర్‌ను మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్, ఏఎస్పీ అంకిత్‌సురానా, ఈవో సూర్యనారాయణలు ఆవిష్కరించారు. సమీక్షాసమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రతి వినతికి సంతృప్తికర పరిష్కారం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- 137 వినతుల సీకరణ



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్



వినతులను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ హేమలత



వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఒక్క వినతికి అర్జీదారు సంతృప్తిచెందే రీతిలో సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. అర్జీదారుల సమస్యను పూర్తిగా విని అర్థం చేసుకున్న తర్వాత సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు. సమస్య పరిష్కరించేటప్పుడు సంబంధిత అర్జీదారు ప్రభుత్వ శాఖలు చూపిన పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది తెలుసుకోవాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ జిల్లా అధికారులతో వినతుల పరిష్కారంపై సమీక్షించారు. ఇందుకు సంబంధించి 30 వినతులు సరిగా పరిష్కరించని కారణంగా రీఓపెన్ చేశామని వాటిని ఆయా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి తదితరులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 137 వినతులు స్వీకరించారు. అనంతరం విశాఖలో ఇటీవల జరిగిన విభిన్న ప్రతిభావంతులు జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన జిల్లా జట్టును కలెక్టర్ అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ బాట్స్‌మన్‌గా ఎంపికైన కె.లిఖిత్, బౌలర్‌గా ఎంపికైన ఆర్.హరికృష్ణలను కలెక్టర్ అభిందించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఇన్‌చార్జ్ ఎ.డి పి.బాలాజీ ఉన్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులను ఆదేశించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 134 వినతులను ఆమె స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పీజీఆర్‌ఎస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపనున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 27 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టుఅధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 27 వినతులు వచ్చాయి. కొండాడ నుంచి మేడఒబ్బంగికి సీసీ రహదారి నిర్మించాలని బెన్నరాయికి చెందిన సూగన్న కోరారు. అక్కన్నగూడ గ్రామానికి చెందిన సవర పెద్దబాపన్న హౌసింగ్ బిల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించాడు. గెద్దగూడకు పాఠశాల భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. బెన్నరాయికి సెల్ టవర్ ఏర్పాటు చేయాలని సవర సూగన్న వినతిపత్రం అందజేశాడు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటంతోనే సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణ

పార్వతీపురంటౌన్: రాజీలేని పోరాటంతోనే సమస్యల పరిష్కారం అవుతాయని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌వై నాయుడు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ బీవీ రమణలు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉండడం సరైంది కాదన్నారు. గిరిజన మంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతూ కాలం గడుపు తున్నారన్నారు. కనీస వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ అమరావతిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనాయక్ తదితరులను అరెస్టు చేశారని, తక్షణమే వారిని విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు దివాకర్, రమేష్, రాజేష్, వెంకట్, మురళి, కామేష్, ఉమ, దీప, షర్మిల, కవిత, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

గజపతినగరం: నిరుద్యోగ యువతీయువకుల కోసం ప్రభుత్వం కంపెనీలను తెచ్చేందుకు ఆలోచన చేస్తుంటే యువతీయువకులు శ్రద్ధ చూపక పోవడం బాధాకరంగా ఉందని రాష్ట్ర, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎన్నారై సాధికారత, సంబంధాలు శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం గజపతినగరంలోని సాయిసిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు కోటి15లక్షల మంది నిరుద్యోగ యువతీయువకులు ఉన్నారని అటువంటి వారి కోసం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గాలు చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మక్కువ శ్రీధర్, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జనసేన నాయకుడు మర్రాపు సురేష్, సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ ఎస్.శేఖర్ బాబు, లెంక బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

221మంది ఎంపిక

గజపతినగరం సాయిసిద్ధార్థ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి 417మంది హాజరు కాగా 221మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు సాయిసిద్ధార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ రెడ్డి శేఖర్ బాబు సోమవారం సాయంత్రం తెలిపారు.

పోలీస్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

విజయనగరం క్రైమ్: స్టైఫండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో భాగంగా దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 321 మంది హాజరైనట్టు ఎస్పీ వకుల్‌జిందల్ తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు, ధ్రువపత్రాల పరిశీలన తర్వాత ఎత్తు, ఛాతి విస్తీర్ణం కొలతలు చేపట్టారు. ఇందులో అర్హత సాధించిన వారిని పీఈటీకి అనుమతించారు. ముందుగా నిర్వహించిన 1600 మీటర్ల పరుగు పందెంలో నిర్ణీత సమయానికి చేరుకున్నవారికి 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తీర్ణత సాధించినవారికి అర్హత పత్రాలు అందజేశారు. నియామక ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, ఎం.వీరకుమార్, ఎస్.బాపూజీ, టి.ఎస్.శ్రీనివాసరావు, కె.థామస్‌రెడ్డి, ఏఓ పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

హాలో.. నా పేరు డైరీ..



హాలో.. నా పేరు డైరీ. కొందరు దైనందిని అంటారు. ఇప్పటితరానికి నా గురించి అంతగా పరిచయం ఉండకపోవచ్చు. పాత తరానికి నేను ఆత్మీయ నేస్తాన్ని. నిత్యం నన్ను దసూర్తితో స్పృశించేవారు. ఏడాదిలో 365 రోజులూ (లీప్ సంవత్సరం వస్తే 366 రోజులు పాటు) తమ అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలు, లెక్కలు, ఖర్చులు, ప్రణాళికలు.. ఇలా ఒకటేమిటి వారి అంతరంగమంతా నాపై అక్షరాలుగా పరిచేవారు. అవసరమైనప్పుడు, పాత రోజుల్లోకి వెళ్లాలనుకున్నప్పుడు నాలోని పేజీలు తిరగేస్తే గడిచినకాలం మళ్లీ కళ్లముందు కదలాడేది. సందర్భం, అందులోని విషయం ఆధారంగా వారి ముఖంలో దాదాపు నవరసాలు ప్రస్ఫుటమయ్యేవి. కొత్త ఏడాది వస్తుందంటే నన్ను సమకూర్చుకునేందుకు చాలా మంది ఆరాటపడేవారు. నాలోని రోజుకో పేజీని కేటాయించేవారు. కొందరైతే ఏం చేయాలి, ఎలా ముందుకెళ్లాలంటూ భవిష్యత్తుపై ఆశావహ దృక్పథంతో ప్రణాళిక చే(రా)సుకునేవారు. ఇంకొందరు తమ రాతలను పునఃశ్చరణ చేసుకొని లోటుపాట్లను అధిగమించే ప్రయత్నం చేసేవారు. చాలామంది నాలోని రాతలను నిజం చేసుకొని ఉన్నత స్థానాలకు వెళ్లి దశాబ్దాల కాలం పాటు తాము సాధించిన విజయాన్ని చిరస్మరణీయంగా భద్రపర్చుకునేవారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతూ సామాజిక మాధ్యమాలు, బ్లాగుల్లో సందేశాలు, అభిప్రాయాలు పంచుకుంటున్నా.. నా పేజీలో రాసిన అక్షర సత్యం ఇచ్చే సంతృప్తి ఇవ్వదన్నది చాలామంది నోట వినిపిస్తోంది. యవ్వనంలో మీరు నింపిన నా పేజీలను మీ పిల్లలకు చూపిస్తే ఆ కిక్కేవేరన్నది మీకు తెలియని కాదు. ఆ రోజులు ఎలా ఉండేవి.. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకునే సూచనలను ప్రత్యేకంగా పిల్లలకు చెప్పాల్సిన పని ఉండదు. ఆ రోజు రానే వచ్చింది. నన్ను మరోసారి గుర్తుచేసుకుంటారని ఆశిస్తూ మీ ఆత్మీయ డైరీని.

– విజయనగరం